వైభవంగా ఎల్లమ్మ జాతర

• బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు • భక్తిశ్రద్ధలతో రథోత్సవం

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, రథంపై అమ్మవారి ఊరేగింపు..హాజరైన భక్తులు

కొడంగల్, ఫిబ్రవరి 23 : పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ జాతర వైభవంగా సాగుతున్నది. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ జాతరకు మండల పరిధిలోని భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కుటుంబీకులు అమ్మవారికి పంచామృతాలు, గంగాజలంతో అమ్మవారికి అభిషేకించి ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు నిర్వహించారు. పట్టణ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో జాతర జరుగుతుంది.

దీంతో పంటలు బాగా పండాలని, పిల్లా పాపలను చల్లంగా చూడాలని రైతులు కోరుతూ అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని రథంపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. రథోత్సవంలో భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు.

రథం ఊరేగింపులో భక్తులు భండారు (కుంకుమ, పసుపు, గవ్వలు) రథంపై చల్లుతూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో జాతర సందర్భంగా మిఠాయి, టెంకాయలు, చిన్నారుల ఆటవస్తువుల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.

ఇసుక తరలింపునకు కాంగ్రెస్ నేతల యత్నం

స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

బషీరాబాద్, ఫిబ్రవరి 23 : జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను అక్రమంగా తరలించేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకుల ఆట కట్టించారు గ్రామస్తులు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి జేసీబీ, ట్రాక్టర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై రమేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మైల్వార్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఇసుకను అక్రమంగా తరలించేందుకు గ్రామ శివారులోని నదికి జేసీబీ, ఏడు ట్రాక్టర్లను తీసుకుని గురువారం రాత్రి బయలుదేరాడు. విషయం గ్రామస్తులకు తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఘటనా స్థలం వద్దకు వెళ్లి ట్రాక్టర్లు, జేసీబీలను తరలించేందుకు యత్నించగా, ట్రాక్టర్ డ్రైవర్లు అప్రమత్తమై ట్రాకర్లను తరలించకుండా టైర్లలో గాలి తీసివేశారు. దీంతో పోలీసులు సంబంధిత ట్రాక్టర్ యాజమానులకు, డ్రైవర్లను హెచ్చరించి, గ్రామ పెద్ద సహాయంతో ట్రాక్టర్ టైర్లలో గాలి నింపి ఆరు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. పూర్తి విచారణ అనంతరం ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్‌కు అప్పగిస్తామన్నారు.

ప్రమాదవశాత్తు విత్తన చెరుకు దగ్ధం

పెద్దేముల్, ఫిబ్రవరి 23 : పొలంలో విత్తనం కోసం నిల్వ పెట్టుకున్న చెరుకు ప్రమాదశాత్తు దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ మీదిపల్లిలో జరిగింది. బాధిత రైతు మున్నూరు నర్సింహులు తండ్రి వీరన్న తెలిపిన వివరాలు.. నర్సింహులు తన పొలంలో చెరుకు పంట సాగులో భాగంగా డ్రిప్‌ను వేశారు. ఇదే పొలంలో ఓ ఇనుప విద్యుత్ స్తంభంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. శుక్రవారం ఉదయం పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం వద్ద తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగి 3 టన్నుల చెరుకు, డ్రిప్ పైపులు పూర్తి కాలిపోయాయి. దీంతో రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

కూలీలకు ఉపాధి కల్పిస్తాం

మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఫిబ్రవరి 23 : జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద కూలీ పని కల్పిస్తామని తాండూరు మండల ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కరణ్‌కోట పంచాయతీ కార్యాలయంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలీలందరికీ పని కల్పించే బాధ్యత అధికారులదని తెలిపారు. గ్రామంలో పనిని గుర్తిస్తే, వారికి ఆయా ప్రాంతాల్లో కూలీ పనులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు, ఎంపీటీసీ శివకుమార్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం, ఫిబ్రవరి 23: లారీ-మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ క్రీడా క్షేత్రం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. తక్కళపల్లి గ్రామానికి చెందిన పట్నం శ్రీశైలం (58) ఇబ్రహీంపట్నం నుంచి మోటార్ సైకిల్‌పై తన స్వగ్రామం వెళ్తున్నాడు. గున్‌గల్ క్రీడాక్షేత్రం సమీపంలోకి రాగానే ముందు నుంచి వెళ్తున్న లారీని వెనుకాల నుంచి ఢీకొట్టాడు. ఈ క్రమంలో మోటార్ సైకిల్ లారీ కిందకు దూసుకెళ్లడంతో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్‌కు రూ.66.98కోట్ల అంచనా బడ్జెట్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, ఫిబ్రవరి 23 : రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజులార మేశ్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో 2024-25 సంవత్సరానికి అంచనా బడెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. బడ్జెట్ సమావేశం అనంతరం చైర్పర్సన్ మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ మున్సిపల్ 2024 - 25 సంవత్సరానికి రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టామని తెలిపారు. వీటిలో ఖర్చులు రూ.66.72 కోట్లు పోను.. మిగులు బడ్జెట్ రూ.26 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. వీటిలో మున్సిపల్‌కు వచ్చిన పన్నులు రూ.10 కోట్లు, నాన్ ట్యాక్స్‌లు రూ.10.16 కోట్లు, డిపాజిట్స్, అడ్వాన్స్ రూ.45 లక్షలు, మున్సిపల్ గ్రాండ్ మొత్తం కలిపి రూ.46.10 కోట్లు చూపించామని తెలిపారు. జీతాలు, తదితర రూ.5. 85 కోట్లు, శానిటేషన్ పరంగా రూ.2.54 కోట్లు, విద్యుత్ చార్జీలు రూ.1.75 కోట్లు, లోన్స్ రూ.1.10 కోట్లు, రూ.2.26కోట్ల గ్రీన్ బడ్జెట్, మున్సిపల్‌లోని అన్ని విభాగాలకు కలిపి మెయింటెనెన్స్ చార్జీలు రూ.3.22 కోట్లు, క్యాపిటల్ వర్క్స్ రూ.3.69 కోట్లు, గ్రాంట్స్ రూ.46.10 కోట్లు, డిపాజిట్లు రూ.45 లక్షలు కలిపి మొత్తం రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో ప్రవేశపెట్టామన్నారు. ఈ బడ్జెట్‌ను కౌన్సిలర్లు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ శంషాద్ బేగం, కమిషనర్ జాకిర్ అహ్మద్, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం..

రూ. మూడు లక్షల విలువైన వస్తువులు దగ్ధం

కొడంగల్, ఫిబ్రవరి 23: పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని ఇనాయత్ ఇంట్లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి వస్తువులు దగ్ధం అయిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితుడు కథనం ప్రకారం ఇంట్లో ఒక్కసారిగా విద్యుత్ ప్రమాదం సంభవించి మంటలు చెలరేగి బీరువాలోని వస్తువులు కాలిపోయినట్లు తెలిపారు. ప్రమాదంలో దాదాపు రూ.3లక్షల విలువైన వస్తువులు ఆహూతైనట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దాముతో పాటు పట్టణ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ హమీద్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కనుల పండుగలా శివపార్వతుల కల్యాణోత్సవం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 23: తాండూరు మండలం, చెంగోల్ గ్రామ శివాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. జడ్పీటీసీ గౌడి మంజుల, మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో శివస్వాములు, మహిళలు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని చింతామణిపట్టణం, పర్వతాపూర్, గౌతాపూర్, అల్లాపూర్ తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆలయం శివనామస్మరణతో మారుమ్రోగింది.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ స్వరూప, మాజీ సర్పంచ్‌లు మల్లేశ్వరీ, రాజప్ప, గోపాల్‌రెడ్డి, ధర్మకర్తలు హన్మయ్య, పులేందర్, నర్సింహులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

కులకచర్ల, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని హన్మ్యనాయక్‌తండా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ట్లు అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నేనా వత్ రాహుల్ నాయక్ తెలిపారు. శుక్రవారం హన్మ్యనా యక్‌తండా ప్రాథమిక పాఠశాలకు ప్రింటర్‌ను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దాలి నాయుడు, మాజీ ఉపసర్పంచ్ చందర్, నర్సింగ్ పాల్గొన్నారు.

కులకచర్ల, ఫిబ్రవరి 23 : చౌడాపూర్ మండల పరిధిలోని వీరాపూర్ గ్రామానికి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, పరిగి నియోజకవర్గం ఇన్‌చార్జి బూనేటి మారుతికిరణ్ తన స్వంత నిధులతో అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవులు, బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, పరిగి మండల అధ్యక్షుడు ఆంజనేయులు, దోమ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

శివనామస్మరతో మార్మోగిన కులకచర్ల

కులకచర్ల, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నిర్వహించిన శివస్వాముల జ్యోతిర్లింగాల మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో నీరటి కర్ణయ్య స్వామి ఇంటి దగ్గర నిర్వహించిన పడిపూజ కార్యక్రమానికి భక్తులు, శివస్వాములు భారీ ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే..

ధారూరు, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజుగుప్తా నివాసంలో శుక్రవారం నిర్వహించిన శివస్వాముల పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు రాజుగుప్తా, మాణిక్‌ప్రభు, మాణిక్యం తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌రావు

పరిగి, ఫిబ్రవరి 23: సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టానని తహసీల్దార్, రావులపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి ఆనంద్‌రావు సూచించారు. శుక్రవారం పరిగి మండలం రావులపల్లి గ్రామంలో రూ.ఐదులక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సీసీ పనులను తహసీల్దార్ ఆనంద్‌రావు దగ్గరుండి పర్యవేక్షించారు. భారీ వాహనాల రాకపోకలకు సైతం అనువుగా ఉండేలా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పరిగి, ఫిబ్రవరి 23 : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, జడ్పీహెచ్ఎస్ నెం.1 ప్రధానోపాధ్యాయులు గోపాల్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్, రాజేశ్ పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరిగిలోని పల్లవి కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ అంబాసిడర్ల శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఓటరుగా నమోదు ఆన్‌లైన్‌లోనూ చేసుకోవచ్చని చెప్పారు. ఓటుహక్కు ఉన్న వారందరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

ఉపాధ్యాయ విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 23: మండలంలోని ఏర్పుమళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. వీరిని క్లస్టర్ హెచ్ఎం శ్రీహరిరెడ్డి, పాఠశాల హెచ్ఎం నీలకంఠం, ఎస్ఎంసీ చైర్మన్ అనంతయ్య, ఉపాధ్యాయులు రాములు, జీవన్‌కుమార్, శ్రీనివాస్, సురేశ్ అభినందించి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు..

విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఇందూరు కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింగ్‌రావు

పెద్దేముల్, ఫిబ్రవరి 23: 2023-24 విద్యా సంవత్సరానికి శిక్షణ ఫౌండేషన్ సంస్థ ప్రేరణ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇందూర్ కాంప్లెక్స్ స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ ఫౌండేషన్ మండల కోర్డినేటర్ తుల్జప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు జీకేపై పట్టు సాధించాలన్నారు. ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గాజీపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజయం సాధించి మండల స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో ఇందూరు కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింగ్‌రావు, సీఆర్పీ రాఘవేందర్, శిక్షణ ఫౌండేషన్ కోఆర్డినేటర్లు కాశీనాథ్, రాజు, ప్రభు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దేముల్, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని మంబాపూర్ గ్రామానికి చెందిన వడ్డె మొగులప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న పెద్దేముల్ ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ నారాయణ రెడ్డి శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎండీ. మైపూజ్, వెంకటప్ప, జి.వెంకటయ్య, యాదప్ప, ఎల్లప్ప, భీములు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి

పరిగి టౌన్, ఫిబ్రవరి 23 : పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పరిగి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావల్సిన మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ, ఆర్థిక కార్యదర్శి రాజేశ్, రాష్ట్ర కౌన్సిలర్లు బసిరెడ్డి, శ్రీనివాసరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొనసాగుతున్న పల్లెదవాఖాన పనులు

పెద్దేముల్‌లో కొనసాగుతున్న పల్లె దవాఖాన నిర్మాణ పనులు

పెద్దేముల్, ఫిబ్రవరి 23 : మండలానికి నూతనంగా మంజూరైన పల్లె దవాఖాన (సబ్ సెంటర్) నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మండలంలో ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మొత్తం 9 సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో మండల పరిధిలోని గాజీపూర్, కందనెల్లి, ఇందూరు, అడికిచెర్ల, మంబాపూర్, నాగులపల్లి, మారేపల్లి, తట్టేపల్లి, పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సబ్ సెంటర్లుగా విభజించారు. మండల పరిధిలో ఉన్న 9 సబ్ సెంటర్లలో మొత్తం 6 సబ్ సెంటర్లకు ఇదివరకే సొంత భవనాలు ఉన్నాయి. పెద్దేముల్, తట్టేపల్లి, మారేపల్లిలోని పల్లె దవాఖానలకు సొంత భవనాలు లేవు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అప్పటి వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో ఆయా జిల్లా కలెక్టర్లకు వైద్యశాఖ తరపున పల్లె దవాఖానల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు.

మండలంలోని తట్టేపల్లి, పెద్దేముల్ గ్రామాల్లోకి ఒక్కో సబ్‌సెంటర్ నిర్మాణ పనులకు రూ.20లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పల్లె దవాఖానల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మారేపల్లిలో పల్లె దవాఖాన నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ స్థలాన్ని అధికారులు ఆలస్యంగా కేటాయించారు. దీంతో ఇక్కడ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

• ఒక్కో పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20లక్షలు
• బీఆర్ఎస్ హయాంలో నిధులు మంజూరు

మెరుగైన వైద్య సేవలను అందిస్తాం

జిల్లా కలెక్టర్ నిధులతో మండలంలో మొత్తం 3 సబ్‌సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటిలో పెద్దేముల్, తట్టేపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల మారేపల్లిలోప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. త్వరలో అక్కడ కూడా పనులు ప్రారంభిస్తాం. అన్ని సబ్‌సెంటర్లను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చి అన్ని గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తాం.

– బుచ్చిబాబు, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దేముల్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి/తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962